బుధ వారం
3-1-2024
సంపుటి - 09,
సంచిక - 421
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh
CEO & Editor : G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
❍ Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole



## అయ్యప్ప భక్తులకు బైరి నరేష్ పదే పదే క్షమాపణ చెప్పినా...

# ఎందుకు అంత ఆక్రోశం!

### ఆ దేవుడే ఉంటే మతోన్మాదులకు అహింసా, శాంతిని ప్రభోదించాలి

**గతంలో అయ్యప్పపై బైరి నరేష్ మాట్లాడిన వివాదాస్పద వాఖ్యలకు పలు మాధ్యమాల్లో క్షమాపణలు (బహిరంగ క్షమాపణలు) చెప్పినా కక్షగట్టి ఎందుకు హింసాత్మక దాడి చేస్తున్నారు. మత రాజకీయాల కోసమా !. అభాగ్యులైన మంచి అయ్యప్ప భక్తులకు చెడ్డ పేరు తెచ్చేలా కొందరు మూర్ఖులు భక్తి ముసుగులో రెచ్చిపోయి ఎవరి మెప్ప కోసం ఇదంతా చేస్తున్నారు. దేవుడు మనిషి పై దాడి చెయ్యమన్నాడా ?! లేదుకదా !**

**హైదరాబాద్, జనవరి 3 (సమ సమాజం):** నూతన సంవత్సరం రోజున ములుగు జిల్లా, ఏటూరు నాగారం గ్రామంలో స్థానిక అంబేద్కరిస్టులు, మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం వారు నిర్వహించతలపెట్టిన విజయ్ దివాస్ (బీమా కోరేగావ్ ) కార్యక్రమాన్ని స్థానిక మతవాదులు, బిజెపి నాయకులు అయ్యప్ప స్వామి మాలలో ఉన్న అమాయక భక్తులను రెచ్చగొట్టి సభను జరగకుండా అడ్డుకోవడం అప్రజాస్వామికం. స్వామి మాలలో ఉన్న వారు నిర్వాహకులను బూతులు తిడుతూ, కుర్చీలను చిందర వందర చేయడం దౌర్జన్యం అవుతుంది. మధ్యం, మత్తు పదార్థాలు, మూఢనమ్మకాలు వీడుదాం - శాస్త్రీయంగా జీవిద్దాం అనే మంచి ఉద్దేశంతో అంతర్గతంగా, ప్రజాస్వామ్యయుతంగా శాంతియుతంగా జరుగుతున్న ఆ కార్యక్రమాన్ని కేవలం రాజకీయ దురుద్దేశంతో అడ్డుకోవడం సరైనది కాదు అని మూఢనమ్మకాల నిర్మూలన సంఘం భావిస్తుంది. బైరి నరేష్‌కు అయ్యప్ప స్వాముల పట్ల సదుద్దేశం ఉన్నప్పటికి కొందరు స్వార్ధపూరిత రాజకీయ నాయకులు కావాలని రెచ్చగొట్టి దాడులు చేయిస్తున్నారని వినికిడి. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం స్పందించి బైరి నరేష్‌కు పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేసి సెక్యూరిటీని కల్పించాలని ప్రజాస్వామిక వాదులు కోరుకుంటున్నారు. బైరి నరేష్ స్వేఛ్ఛాయుతంగా తమ ప్రసంగాలను, కార్యకలాపాలను, భావప్రకటన స్వేచ్ఛను హరించకుండా కాపాడే బాధ్యత ప్రభుత్వానిదే అని పలువురు ప్రజాస్వామిక వాదులు, మేధావులు, మానవతావాదులు అభిప్రాయ పడుతున్నారు.

4వ పేజీలో...

లౌకిక వాదులకు, హేతువాదులకు ఈ భారత దేశంలో బతికే స్వేఛ్ఛను కోల్పోతున్నట్లుగా జరుగుతున్న పరిణామాలను బట్టి అర్ధమౌతుంది. ఈ దేశంలో ముఢనమ్మకాల బారిన పడి అనేక మంది అభాగ్యులు తమ ఆర్ధిక, సమాజిక దోపిడికి గురౌతున్నారు. అలాంటి వారిని మేల్కొల్పే లక్ష్యంతో డా॥ బైరి నరేష్ తన గళాన్ని నిరంతరం వినిపిస్తున్నారు. సమాజాన్ని మేక్కొల్పుతున్నందుకు ప్రతి ఫలం ఇదేనా !.

**ఓ రెడ్డో, రావో అయితే ఇలానే హింసిస్తారా ? ప్రజాస్వామ్యం గల కాంగ్రెస్ ప్రభుత్వం డా॥ బైరి నరేష్‌కు భద్రత కల్పించలేదా ! మతోన్మాదుల దాడి యావత్ బహుజన సమాజం పైనే ! ఓ బహుజన బిడ్డా !! తస్మాత్ జాగ్రత్త ..ఈ ప్రమాదం నీ వరకు రావచ్చు.**



(ఫైల్ ఫోటో)
ప్రైవేట్ మీటింగ్‌లోకి చొరబడి బెదిరింపులకు గురి చేస్తున్న అయ్యప్ప భక్తులు

## సిఎం రేవంత్‌తో నీతి ఆయోగ్ ఛైర్మన్ భేటీ

### రాష్ట్ర ప్రభుత్వంతో కలసి పనిచేస్తామని హామీ

### నిధుల విడుదల...అభివృద్ధికి సహకరించాలన్న సిఎం రేవంత్

**హైదరాబాద్,జనవరి2(సమసమాజం):** సచివాలయంలో నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ సుమన్ కుమార్ బేరి బృందం ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్కలతో సమావేశమయ్యారు. రాష్ట్ర సమగ్ర ప్రగతి, అభివృద్ధి అంశాలు, విధాన కార్యక్రమాలు, సహకారంపై చర్చించారు. సమర్ధవంతమైన పాలనకు మార్గదర్శక సూత్రంగా కో-ఆపరేటివ్ ఫెడరలిజం ప్రాముఖ్యతను సమావేశంలో సుదీర్ఘంగా



4వ పేజీలో...

## కాళేశ్వరం ప్రాజెక్టుపై వారంలో జ్యుడిషియల్ ఎంక్వైరీ


### కాళేశ్వరంపై బిఆర్ఎస్, బిజెపిలు కలసిపోయాయి

### వాటాలు పంచుకుని పనిచేశాయి

### ఇప్పుడేమే కిషన్ రెడ్డి విమర్శలు దారుణం

### మండిపడ్డ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్,జనవరి2(సమసమాజం):** కాళేశ్వరం ప్రాజెక్టుపై ఈ వారంలో జ్యుడిషియల్ ఎంక్వైరీ వేయబోతున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం నాడు సెక్రటేరియట్ మీడియా సెంటర్‌లో ఉత్తమ్ కుమార్ రెడ్డి



2వ పేజీలో...

## ప్రజలు మోడీనే కోరుకుంటున్నారు

### సర్వే సంస్థలన్నీ ఇదే చెబుతున్నాయి

### 8నుంచి 12 ఎంపి సీట్లు గెలుస్తాం: బండి

**కరీంనగర్,జనవరి2(సమసమాజం):** రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాని మోదీ వర్సెస్ రాహుల్ గాంధీ అనే నినాదంతో జరగబోతున్నాయని కరీంనగర్ బీజేపీ ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. ఏ సంస్థ సర్వే చేసినా 80 శాతానికిపైగా ప్రజలు మోదీనే మళ్లీ ప్రధానమంత్రి కావాలని కోరుకుంటున్నారని చెప్పారు. మోదీ లేని భారత్ ను ప్రజలెవరూ ఊహించుకోవడం లేదన్నారు. తెలంగాణలో బీజేపీ 8 నుండి 12 ఎంపీ స్థానాలను కైవసం చేసుకుంటుందని సంజయ్ ధీమా వ్యక్తం చేశారు.



3వ పేజీలో...

# నేటితో ముగియనున్న ఇంటర్ పరీక్ష ఫీజు గడువు

లేట్ ఫీజురూ.2,500తో చెల్లించేందుకు లాస్ట్ ఛాన్స్

మరో 32 పరీక్షా కేంద్రాల పెంపు




హైదరాబాద్,జనవరి2(**సమసమాజం**): తెలంగాణలో ఇంటర్ వార్షిక పరీక్షల ఫీజు గడువు జనవరి 3తో ముగియనుంది. ఆలస్య రుసుము రూ.2,500తో ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉంది. ఇప్పటివరకు ఫీజు చెల్లించని విద్యార్థులు.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సి ఉంటుంది. ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరంలో కొన్ని కోర్సుల్లో కలిపి 10.59 లక్షల మంది విద్యార్థులు ఉండగా.. ఫీజు చెల్లింపు గడవు ముగిసేనాటికి 9.77 లక్షల మంది విద్యార్థులు ఫీజు చెల్లించారు. ఇంకా 82 వేల మంది విద్యార్థులు ఫీజు చెల్లించాల్సి ఉంది. ఈ క్రమంలో మరోసారి ఫీజు చెల్లించేందుకు ఇంటర్ బోర్డు అవకాశం ఇచ్చింది. ఇంటర్ రెగ్యులర్ విద్యార్థులు రూ. 500 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సైన్స్ గ్రూపుల విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షల నిమిత్తం అదనంగా రూ. 210 చెల్లించాల్సి ఉంటుంది. ఒకేషనల్ విద్యార్థులు రూ. 710 చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి 10,59,233 మంది విద్యార్థులు వివిధ కాలేజీల్లో అడ్మిషన్లను పొందారు. వీరిలో 8,99,041 మంది విద్యార్థులు నిర్ణీత గడువులోపే పరీక్ష ఫీజులు చెల్లించారు. మరో 61,005 మంది విద్యార్థులు రూ.100 ఫైన్‌తో, 8,638 మంది విద్యార్థులు రూ.500ల ÷న్‌తో, 5,212 మంది విద్యార్థులు రూ.1000 ÷న్‌తో, 3,144 మంది విద్యార్థులు రూ.2000 ÷న్‌తో చెల్లించారు. ఇప్పటి వరకు మొత్తంగా 9,77,040 మంది విద్యార్థులు మార్చి -2024 పరీక్ష ఫీజులను చెల్లించినట్లు ఇంటర్మీడియట్ బోర్డు వెల్లడించింది. తెలంగాణ ఇంటర్ వార్షిక పరీక్షల షెడ్యూలును ఇంటర్ బోర్డు డిసెంబరు 28న విడుదల చేసిన సంగతి తెలిసిందే. ప్రకటించిన షెడ్యూలు ప్రకారం వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందులో ఫిబ్రవరి 28 నుంచి ఇంటర్ ఫస్టియర్, ఫిబ్రవరి 29 నుంచి ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 17న ఎథిక్స్ / హ్యూమన్ వాల్యూస్ పరీక్ష, ఫిబ్రవరి 19న ఎన్విరాన్‌మెంటల్ పరీక్ష నిర్వహించనున్నారు. ఇంటర్ రెగ్యులర్ పరీక్షలతోపాటు, ఒకేషనల్ పరీక్షలు కూడా ఫిబ్రవరి 28న ప్రారంభంకాన్నాయి. ఇంటర్ ఫస్టియర్ ఒకేషనల్ పరీక్షలు ఫిబ్రవరి 28 నుంచి మార్చి 11 వరకు, ఇంటర్ సెకండియర్ ఒకేషనల్ పరీక్షలు ఫిబ్రవరి 29 నుంచి మార్చి 12 వరకు జరుగనున్నాయి. ఇదిలావుంటే తెలంగాణలో ఇంటర్ పరీక్షా కేంద్రాల సంఖ్య ఈ ఏడాది పెరిగింది. ప్రస్తుత కేంద్రాలకు అదనంగా మరో 32 పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్య పెరిగిన దృష్ట్యా పరీక్షాకేంద్రాలను పెంచాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్య గతేడాదితో పోల్చితే ఈసారి 30 వేలు అదనంగా పెరిగింది. గతేడాది ఇంటర్ పరీక్షలకు 1,480 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేయగా, ఈ ఏడాది 1,512 పరీక్షాకేంద్రాలను సిద్ధం చేయనున్నారు. ఈ ఏడాది మొత్తం 10,59,233 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరుకానున్నారు. ఫిబ్రవరి 28 నుంచి ఇంటర్ ఫస్టియర్, ఫిబ్రవరి 29 నుంచి ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఫస్టియర్ ఒకేషనల్ పరీక్షలు ఫిబ్రవరి 28 నుంచి మార్చి 11 వరకు, ఇంటర్ సెకండియర్ ఒకేషనల్ పరీక్షలు ఫిబ్రవరి 29 నుంచి మార్చి 12 వరకు జరుగనున్నాయి. ఆయాతేదీల్లో ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలను నిర్వహించ నున్నారు. ఫిబ్రవరి 1నుంచి 15 వరకు సెకండ్ ఇయర్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది తొలిసారిగా ఫస్టియర్ విద్యార్థులకు ఇంగ్లిష్ ప్రాక్టికల్స్‌ను నిర్వహించనున్నారు. ఈ ప్రాక్టికల్స్‌ను ఫిబ్రవరి 16న నిర్వహించనున్నారు. ఇంగ్లిష్ థియరీ పరీక్షకు 80 మార్కులకు ఉండనుండగా.. ప్రాక్టికల్ పరీక్షకు 20 మార్కులు ఉండనున్నాయి.

# సిఎం రేవంత్‌తో కూనంనేని తదితరుల భేటీ

**హైదరాబాద్,జనవరి2 (సమసమాజం): సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సీపీఐ నేతలు కూనంనేని సాంబశివ రావు, నారాయణ, చాడ వెంకట్ రెడ్డి, ఇతర నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు మేలు చేసే ప్రతి పనిలో ప్రభుత్వానికి తమ వంతు సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుందన్నారు.**



## కాళేశ్వరం ప్రాజెక్టుపై వారంలో

# జ్యుడిషియల్ ఎంక్వైరీ

(మొదటి పేజీ తరువాయి)మిడియాతో మాట్లాడుతూ... కాళేశ్వరం ప్రాజెక్టులో బీఆర్ఎస్, బీజేపీ కలిసి అవినీతికి పాల్పడ్డాయన్నారు. కాళేశ్వరంపై పదేళ్ల నుంచి సీబీఐ విచారణ ఎందుకు జరపలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం డ్యామేజ్ రిపేర్ చేసే బాధ్యత ఏజెన్సీదేనని చెప్పారు. కిషన్‌రెడ్డి నిరాధారమైన ఆరోపణలతో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్ 3500 రోజులు సన్నిహితంగా గడిపి 20 రోజుల కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని ధ్వజమెత్తారు. కేంద్రమంత్రి మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకి కేంద్రంలో ఉన్న బీజేపీ మద్దతు ఇచ్చిందన్నారు. 'మీరు దోచుకొండి, మా వాట మాకు ఇవ్వండి' అని కేంద్ర ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వానికి చెప్పిందన్నారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ తన నిబంధనలు మార్చుకొని కేసీఆర్ ప్రభుత్వానికి కాళేశ్వరం ప్రాజెక్టుకు లోన్ ఇచ్చిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మేడిగడ్డపై మాట్లాడానికి కిషన్‌రెడ్డికి కామన్ సైన్స్ ఉండాలని చెప్పారు. మేడిగడ్డ కుంగిపోయినప్పుడు కిషన్‌రెడ్డి కనీసం విజిట్ కూడా చేయలేదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతో కట్టిన ప్రాజెక్టు కుంగిపోతే కేంద్రమంత్రి సైలెంట్‌గా ఉన్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం పెంచిన అంచనాలకు కూడా కేంద్ర ప్రభుత్వమే లోన్ ఇచ్చిందన్నారు. కాళేశ్వరంపై ఆరోపణలు చేసిన కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. దేశంలో ప్రతిపక్ష నాయకులపై కేసులు వేసిన కేంద్ర ప్రభుత్వం బీఆర్ఎస్‌పై విచారణ ఎందుకు జరపలేదని నిలదీశారు. కాళేశ్వరం తప్పులపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పారదర్శక పాలన అందిస్తామని తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. జాతీయ హోదా కోసం బీఆర్ఎస్ అప్లయ్ చేయలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిలదీశారు.

# ప్రజలకు చేరువగా కాంగ్రెస్ ప్రభుత్వం

## సమస్యల పరిష్కారం కోసం ప్రజాపాలన

## ఖమ్మం పర్యటనలో మంత్రి పొంగులేటి




ఖమ్మం,జనవరి2(**సమసమాజం**): కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం ఉవ్వెత్తున నడుస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలనలో దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. మంగళవారం ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి మార్కెట్ యార్డు నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. పేదవాడిని అన్ని రంగాల్లో అదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వం ఎకైక ఎజెండా అని స్పష్టం చేశారు. ప్రజలు కోరుకునేదే ప్రభుత్వం చేస్తుందన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా తప్పించుకోకుండా ఇబ్బందులను అధిగమించి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని తేల్చిచెప్పారు. మద్దులపల్లి మార్కెట్ యార్డు నిర్మాణం పేరుతో మట్టి దిబ్బలను తరలించి కొంత మంది కోట్ల రూపాయల సంపాందించారని ఆరోపించారు. అక్రమార్కులను వదిలి పెట్టే ప్రసక్తే లేదన్నారు. ఖమ్మంలో కోట్లు విలువచేసే భూమిని కబ్జా చేస్తే వారి నుంచి స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆస్తి పేదలకు దక్కుతుందన్నారు. ఎవరైనా ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే తిరిగి అప్పగించాలని లేకుంటే ప్రభుత్వం తన పని తను చేసుకుంటూ పోతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు.

# పార్లమెట్ ఎన్నికల్లో బిజెపి, కాంగ్రెస్‌లను ఓడించాలి

ఆ రెండు పార్టీలకు తెలంగాణపై ప్రేమలేదు

ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ వెనకడుగు

దుబ్బాక కృతజ్ఞతా సభలో మాజీమంత్రి హరీష్ రావు



సిద్దిపేట,జనవరి2(**సమసమాజం**): వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు గుణపాఠం చెప్పాలని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రయోజనాలు బీజేపీ, కాంగ్రెస్‌కు పట్టవని అన్నారు. కేసీఆర్‌కు రైతుల మీద ఉన్న ప్రేమ కాంగ్రెస్‌కి ఉందా అని నిలదీశారు. 4 వేల ఫించన్ ఇస్తామన్నారు.. ఇచ్చారా అని నిలదీశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 9వ తేదీన 2 లక్షలు రుణమాఫీ అని చెప్పి ఇప్పుడు మాట తప్పారన్నారు. 6 కాంగ్రెస్ గ్యారెంటీలపై ప్రశ్నిస్తుంటే తనకు తొందరెక్కువ అని అంటున్నారు..కాంగ్రెస్ నేతలు ఏం చెప్పారో అదే తాను గుర్తుచేస్తున్నానని ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. మంగళవారం నాడు దుబ్బాకలో బీఆర్ఎస్ కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ సభలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, జడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీష్‌రావు మాట్లాడుతూ... ప్రభుత్వం రాలేదని నిరాశ పడవద్దని మనకు ఇది ఒక స్పీడ్ బ్రేకర్ లాంటిదేనని చెప్పారు. తెలంగాణకు బీఆర్ఎస్ శ్రీరామ రక్ష లాంటిదన్నారు. మనం ఎన్నో విజయాలు, అపజయాలు చూశాం.. మనకు పూల బాట తెలుసు, ముళ్ల బాట తెలుసునని అన్నారు. బీఆర్ఎస్ లేకుంటే తెలంగాణనే లేదన్నారు. కాంగ్రెస్ నేతలు అధికారంలోకి రావడానికి ఒకటి కాదు రెండు కాదు.. 412 హామీలు ఇచ్చారని మండిపడ్డారు. కరెంట్ బిల్లు కట్టవద్దని తాము అధికారంలోకి రాగానే 200 యూనిట్లు ఫ్రీ అని కాంగ్రెస్ నేతలు చెప్పారన్నారు. ఇప్పుడు మాత్రం ముక్కుపిండి మరీ కరెంట్ బిల్లులు వసూలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. తాము రాగానే రైతు బంధు 15000 ఇస్తామన్నారు.. ఇచ్చారా అని ప్రశ్నించారు. ప్రజలతో కలిసి మెలిసి ఉందాం.. తెలిసో తెలియకో ఏమైనా పొరపాట్లు జరిగి ఉంటే సరిదిద్దుకుందామన్నారు. భవిష్యత్తు మనదే.. కార్యకర్తలు అధైర్య పడద్దని చెప్పారు. ఏడాది తర్వాత ఖచ్చితంగా ప్రజలు మళ్లీ మనల్నే ఆదరిస్తారని.. ఇప్పటికే ప్రజల్లో ఆలోచన మొదలైందన్నారు. రెండు జాతీయ పార్టీలకు కేంద్రంలో అధికారం కావాలి తప్ప, తెలంగాణ ప్రయోజనాలు పట్టవని మండిపడ్డారు. తెలంగాణ రాగానే లోయర్ సీలేర్ పవర్ ప్రాజెక్టు ఉన్న ఏడు మండలాలను బీజేపీ ఆంధ్రలో కలిపిందని.. దానికి కాంగ్రెస్ మద్దతును ఇచ్చిందని ధ్వజమెత్తారు. ఆ రోజు రాజ్యసభలో కాంగ్రెస్ మద్దతు ఇవ్వకపోతే ఆ ఏడు మండలాలు ఆంధ్రలో కలిసేవి కాదని చెప్పారు. తెలంగాణ ప్రయోజనాలు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు పట్టవన్నారు. రాష్ట్ర హక్కుల కోసం పోరడాలంటే అది బీఆర్ఎస్‌కే సాధ్యమన్నారు. బీజేపీ అడుగులకు మడుగులు వత్తే పార్టీ కాంగ్రెస్ అని హేలన చేశారు. రేపు పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడగాలంటే ఇచ్చిన హామీలు కాంగ్రెస్ నెరవేర్చాలన్నారు. ఇచ్చిన మాట తప్పిన కాంగ్రెస్ వైఖరిని ప్రజల్లో చర్చకు పెట్టాలని ఎమ్మెల్యే హరీష్‌రావు పేర్కొన్నారు.

# దేశంలో పెరుగుతున్న కోవిడ్ కేసులు

# తాజాగా 263 కొత్త కేసులు నమోదు

న్యూఢిల్లీ,జనవరి2(**సమసమాజం**): దేశ వ్యాప్తంగా కొవిడ్ సబ్ వేరియంట్ జేఎన్ 1 కేసులు పెరిగిపోతున్నాయి. తాజాగా 263 కేసులు నమోదైనట్లు వైద్యాధికారులు తెలిపారు. వాటిలో సగానికిపైగా కేరళలోనే ఉన్నట్లు వివరించారు. పది రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలు ఇప్పటివరకు ఈ సబ్-వేరియంట్ ఉనికిని గుర్తించాయి.ఇండియన్ జెనోమిక్స్ కన్సార్టియం రిపోర్ట్ ప్రకారం... కేరళ (133), గోవా (51), గుజరాత్ (34), ఢిల్లీ (16), కర్ణాటక (8), మహారాష్ట్ర (9), రాజస్థాన్ (5), తమిళనాడు (4), తెలంగాణ (2), ఒడిశా (1) చొప్పున యాక్టివ్ కేసులున్నాయి. డిసెంబర్ లో తొలిసారి ఈ వేరియంట్ కేసుల్ని కనుక్కున్నారు. అయితే ఇది అంత ప్రమాదకరం కాదని వైద్యులు అంటున్నారు. ఆరోగ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన డేటా ప్రకారం దేశంలో 573 కొత్త కరోనావైరస్ కేసులు నమోదు కాగా, క్రియాశీల కేసులు సంఖ్య మొత్తంగా 4,565 గా ఉన్నాయి.

# మేడారానికి పెరుగుతున్న భక్తుల రాక

## ముందే గద్దెలను దర్శించుకుంటున్న జనం

## ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు జాతర

ములుగు,జనవరి2(**సమసమాజం**): మేడారంలో జాతర సందడి నెలకొంది. ఇప్పటి నుంచే భక్తులు తరలి వచ్చి గద్దెల వద్ద పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతి రెండు సంవత్సరాలకోసారి మాఘశుద్ధ పౌర్ణమి రోజున గిరిజన కుంభమేళా మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ప్రారంభం అవుతుంది. నాలుగు రోజులపాటు మేడారం జాతర ఘనంగా కొనసాగుతుంది. ఈ ఏడాది మేడారం జాతర ఫిబ్రవరి 21వ తేదీన మొదలై 24వ తేదీన ముగియనుంది. అయితే భక్తులు ముందే తరలివచ్చి వనదేవతలకు ముందస్తు మొక్కులు చెల్లించు కుంటున్నారు. ములుగు జిల్లా లోని మేడారం అభయారణ్యంలో ప్రతి రెండు సంవత్సరాలకోసారి జరిగే వనదేవతల జాతర ఘనంగా జరుగుతుంది. నాలుగు రోజుల పాటు జరిగే వనదేవతల జాతరకు దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు చత్తీస్గఢ్ జార్ఖండ్ నుండి గిరిజనులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటారు. సుమారు కోటి మంది భక్తులు తరలిరావడంతో నాలుగు రోజులపాటు మేడారం జనసంద్రంగా మారుతుంది. జాతర సమయంలో గిరిజన దేవతలకు మొక్కులు చెల్లించుకోవడం ఇబ్బంది అనుకున్న భక్తులు ముందస్తు మొక్కులు చెల్లించుకుంటున్నారు. జాతర సమయంలో గ్దదెల వద్ద మొక్కులు చెల్లించుకోవడం, మేడారంలో విడిది చేయడం కష్టం అనుకున్న భక్తులు సుమారు రెండు నెలల సమయానికి ముందుగానే తరలివచ్చి వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్నారు. జాతర సమయంలో గద్దల పైకి వెళ్లే పరిస్థితి లేకపోవడంతో పాటు జనం కిక్కిరిసి లైన్లలో గంటలు తరబడి నిలబడాల్సి వస్తుంది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని భక్తులు ముందుగానే తరలివచ్చి అమ్మవార్ల మొక్కులు చెల్లించుకుంటు న్నామని భక్తులు చెప్పారు. వనదేవతల జాతర ఈసారి బుధవారం రోజున ప్రారంభమై నాలుగో రోజు శనివారం వరకు కొనసాగుతుంది. అమ్మవార్లకు బుధవారం, ఆదివారం పవిత్ర రోజులుగా భావించే భక్తులు ముందస్తు మొక్కుల్లో భాగంగా ఆదివారం, బుధవారం రోజుల్లో పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. ప్రస్తుతం ఆదివారం, సోమవారం నూతన సంవత్సరం రెండు రోజులు సెలవులు రావడంతో భక్తులు పెద్ద



సంఖ్యలో మేడారానికి తరలివచ్చారు. వేములవాడలో తొలి దర్శనం చేసుకుని ఇక్కడకు భక్తులు వస్తుంటారు. జాతర సమయంలో భక్తుల రద్దీతో పాటు కరోనా మరోసారి విజృంభి స్తుండడంతో ముందుగానే వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నామని మరి కొంత మంది భక్తులు చెబుతున్నారు. గత 15 రోజులుగా బుధ, ఆదివారాలతో పాటు సెలవు రోజుల్లో రోజుకు లక్ష మంది భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. దీంతో ఇక్కడ ఏర్పాట్లు కూడా ముందస్తుగానే చేపట్టారు.

# అయోధ్య ఆలయానికి రజనీకి ఆహ్వానం

## వివరాలు వెల్లడించిన బిజెపి నేత అర్జునమూర్తి

చెన్నై,జనవరి2(**సమసమాజం**):తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ కు అయోధ్య నుంచి ఆహ్వానం అందింది. రామ మందిర ప్రారంభోత్సవ కార్యక్రమానికి రజనీకాంత్ ను ఆహ్వానించినట్లుగా బీజేపీ నాయకుడు .అర్జునమూర్తి తెలిపారు. ఈ మేరకు ఆయన కొన్నిఫోటోలను ట్విట్టర్ లో పోస్ట్ చేశారు. రజినీకాంత్ ను ఆహ్వానించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. జనవరి 22న అయోధ్యలో రామ మందిరం ప్రాణప్రతిష్ట కార్యక్రమం జరగనుంది. ఈ వేడుకకు ప్రపంచ నలుమూలల నుంచి ప్రముఖులు హాజరుకానున్నారు. రజనీకాంత్‌తో పాటు, రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముఖేష్ అంబానీ, రతన్ టాటాలు కూడా ఆహ్వా?నం అందింది. అయోధ్యలోని రామ మందిర ఆలయంలో రామ్ లల్లా పట్టాభిషేకానికి ముహూర్తం ఖరారయ్యింది. జనవరి 22న మధ్యాహ్నం 12.20 గంటలకు రాముడి పట్టాభిషేక కార్యక్రమం జరగనుంది. ఈ విషయాన్ని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తెలిపారు. పట్టాభిషేకం తర్వాత హారతి, సూర్యాస్తమయం అనంతరం దీపాలను వెలిగిస్తారని వెల్లడించారు. రామ్ లల్లా ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. ప్రధాన వాస్తు శిల్పి ఆచార్య సత్యేంద్ర దాస్ ఈ విషయంపై స్పందిస్తూ.. రామ్ లల్లా విగ్రహం కట్గ÷న్‌ను ప్రధాని మోదీ మాత్రమే తొలగిస్తా రని తెలిపారు. అనంతరం రామయ్యకు కాటుక దిద్ది.. విగ్రహానికి బంగారు వస్త్రాలతో అలంకరిస్తామని వెల్లడించారు. ప్రత్యేక పూజలతో పాటు 56 నైవేద్యాలను సమర్పిస్తారని పేర్కొన్నారు. ప్రాణ ప్రతిష్ఠకు ముందు బాల రామయ్య విగ్రహా న్ని అయోధ్యలో ఊరేగింపునకు తీసుకువెళ్తారని చెప్పారు.

# పదేళ్లుగా బిఆర్ఎస్ అవినీతిపై ఎందుకు విచారించలే

## కేంద్రంలో అధికారంలో ఉన్నా ఎందుకు అడుగు వేయలే

## సిబిఐ విచారణ కోరడం కెసిఆర్‌ను రక్షించడానికే

## కిషన్ రెడ్డి డిమాండ్‌పై మండిపడ్డ మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్,జనవరి2(**సమసమాజం**): కాళేశ్వరం అవినీతిపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన జ్యూడీషియల్ ఎంక్వైరీకి బీజేపీ సహకరించాలని.. కాళేశ్వరంపై సీబీఐ విచారణకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖ రాయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. అనేక కేసుల్లో కేసీఆర్ ఫ్యామిలీని బీజేపీ రక్షించిందని అన్నారు. ఇన్నేళ్లుగా కేసీఆర్ పై విచారణ ఎందుకు చేయట్లేదని బీజేపీని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్‌ను రక్షించేందుకే కిషన్ రెడ్డి సీబీఐ ఎంక్వైరీ కోరుతున్నారని తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కేసీఆర్ బినామీ అని వ్యాఖ్యానించారు. ఎంఐఎం, బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధిలో బీజేపీ పాత్ర శూన్యంగా ఉందని మండిపడ్డారు. పదేళ్లపాటు బిఆర్ఎస్‌కు వత్తాసు పలికి, వారి అక్రమాలను చూస్తూ వదిలేసిన వారు ఇప్పుడు నీతులు చెబుతున్నారని మంత్రి మండిపడ్డారు. పదేళ్లుగా అవినీతిపై డిమాండ్ చేస్తున్నా ఎందుకు పట్టించుకోలేదన్నారు. కేందరమంత్రిగా కిషన్ రెడ్డి ఏం చేశారని మంత్రి పొన్నాం నిలదీశారు. ప్రజా పాలన దరఖాస్తులకు పొడగింపు లేదని.. జనవరి 6 లోపే అందరూ అప్లై చేసుకోవాలని మంత్రి పొన్నం వెల్లడించారు. ప్రజాపాలన అప్లికేషన్లపై రాజకీయాలు ఏంటని నిలదీశారు. లేడీస్ ఫ్రీ జర్నీ స్కీంను బీఆర్ఎస్ వ్యతిరేకిస్తుందని మండిపడ్డారు. ఆటో డ్రైవర్లు బీఆర్ఎస్ ట్రాప్ లో పడొద్దని పొన్నం చెప్పారు. హిట్ అండ్ రన్ కేసుల్లోని కొత్త రూల్స్‌ను ఆపేయాలని చెప్పారు. ట్రక్కు డ్రైవర్ల సమ్మెతో నిత్యావసరాల ధరలు పెరుగతాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పనిసరిగా ఆమలు చేస్తామని రవాణాశాఖ, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. మంగళవారం మెహిదీపట్నం సర్కిల్ విజయనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ సెంటర్‌ను మంత్రి పరిశీలించారు. ఇప్పటి వరకు నగర వ్యాప్తంగా ఇప్పటి వరకు కంటోన్మెంట్‌తో పాటు 650 కేంద్రాలను ఏర్పాటు చేసి 9.92 లక్షల దరఖాస్తులు స్వీకరించామని మంత్రి వివరించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా జీహెచ్ఎంసీ అధికారులు సమర్థవంతంగా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. పబ్లిక్ ఎక్కువ వచ్చినా ఇప్పుడున్న కౌంటర్ల కంటే అవసరం మేరకు కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటామని తెలిపారు. అర్హులైన నిరుపేదలకు పథకాలు అందుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్రజాపాలనలో భాగస్వామ్యం కావాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జోనల్ కమిషనర్ వెంకటేష్ దొత్రే, ప్రత్యేక అధికారి, డిప్యూటీ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపిలో లోక్‌సభ టిక్కెట్లకు డిమాండ్

## పార్టీ కార్యాలయానికి పులువురు నేతల క్యూ

## టిక్కెట్ల కేటాయింపు అధిష్టానందేనన్న కిషన్ రెడ్డి



హైదరాబాద్,జనవరి2(**సమసమాజం**): పార్లమెంట్ ఎన్నికలపై బీజేపీ ఫోకస్ పెట్టడంతో.. టిక్కెట్లు ఆశిస్తున్న పలువురు నేతలు పార్టీ కార్యాలయానికి క్యూ కట్టారు. తాము ఓటీ చేస్తే స్థానాల్లో టిక్కెట్ వచ్చేలా చూడాలని పార్టీ అధ్యక్షుడు కిషన్ రెడ్డికి వినతిపత్రాలు సమర్పించారు. కసరత్తులో భాగంగానే ఆయా లోక్‌సభ స్థానాల్లో బలమున్న నేలను బరిలో దింపేందుకు రంగం సిద్ధం చేసుకుంటుంది. 5 రోజుల క్రితం పార్లమెంట్ ఎన్నికలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా కేడర్‌కి దిశానిర్దేశర చేసిన విషయం తెలిసిందే. ఈ సారి తెలంగాణలో అత్యధిక ఎంపీ స్థానాలు గెలవాలని అమిత్ షా తెలంగాణకు వచ్చి కమలం కేడర్‌కి చెప్పారు. ఇందులో భాగంగానే బీజేపీలో బలంగా ఉన్న అభ్యర్థులపై బీజేపీ హైకమాండ్ దృష్టి సారించింది. దీంతో నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి నాయకుల తాకిడి మొదలైంది.నాయకుల వరుసబెట్టి బీజేపీ ఆఫీస్‌కి క్యూలు కడుతున్నారు. బీజేపీ అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని పార్లమెంట్ టికెట్ ఆశావాహులు కలుస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసే అవకాశం ఇవ్వాలని మాజీ ఎంపీ చాడా సురేష్‌రెడ్డి, కూన శ్రీశైలం గౌడ్, రాణీ రుద్రమదేవి కోరారు. మల్కాజ్‌గిరి లోక్‌సభ సీటును చాడా సురేష్‌రెడ్డి, కూన శ్రీశైలం గౌడ్, పన్నాల హరీష్‌రెడ్డి ఆశిస్తున్నారు. బీజేపీలో మల్కాజ్‌గిరి సీటుకు ఫుల్ డిమాండ్ ఉంది. మల్కాజ్‌గిరి నుంచి పోటీచేస్తానని ఇప్పటికే మాజీ మంత్రి ఈటల రాజేందర్ ప్రకటించిన విషయం తెలిసిందే. మరోవైపు భువనగిరి నుంచి పోటీకి మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ రెడీ అవుతున్నారు. కిషన్‌రెడ్డిని బూర నర్సయ్య గౌడ్ కలిశారు. అయితే లోక్ సభ అభ్యర్థుల ఎంపిక బాధ్యత పార్టీ అధిష్టానానిదేనని బీజేపీ స్టేట్ చీఫ్ కిషన్ రెడ్డి అన్నారు. సిట్టింగులను మార్చే ప్రసక్తే లేదని క్లారిటీ ఇచ్చారు. సికింద్రాబాద్ నుంచి తాను, కరీంనగర్ నుంచి బండి సంజయ్, నిజామాబాద్ నుంచి అర్వింద్, ఆదిలాబాద్ నుంచి సోయం బాపురావ్ పోటీలో ఉంటున్నట్టు క్లారిటీ ఇచ్చారు. మంద కృష్ణ మాదిగ పోటీపై ఎక్కడా చర్చ జరగలేదని తెలిపారు. బీజేపీ శాసన సభా పక్ష నేత ఎంపికపై ఢిల్లీ నుంచి అబ్జర్వర్లు వచ్చాక క్లారిటీ వస్తుందని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీసీ నినాదం వర్కవుట్ అయ్యిందని, ఓట్లశాతం గణనీయంగా పెరిగిందని చెప్పారు. ఫిబ్రవరి 28వ తేదీగానీ, మార్చి మొదటి వారంలో గానీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ప్రజాపాలన కొత్త మురిపెంలా ఉందంటూ సెటైర్ వేశారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి కలిగి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించబోమని చెప్పారు.

# ప్రజలు మోడీనే కోరుకుంటున్నారు

(మొదటి పేజీ తరువాయి) రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు బాగోలేవన్నారు. ఉద్యోగుల జీతాలకు కూడా పైసల్లేవని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో సహా.. కొత్తగా ఇస్తున్న హామీల అమల సంగతి దేవుడెరగని చెప్పారు. తెలంగాణలోనూ ఈసారి పార్లమెంట్ ఎన్నికలు బీజేపీ వర్సెస్ కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని తెలిపారు. బీఆర్ఎస్ మూడోవ స్థానానికి పడిపోవడం ఖాయమన్నారు. పొరపాటున ఎవరైనా బీఆర్ఎస్ కు ఓటేస్తే అది డ్రైనేజీలో వేసినట్లేనని చెప్పారు. గల్లీలో, ఢిల్లీలో అధికారంలో లేని బీఆర్ఎస్ ఒకవేళ ఆ పార్టీ ఎంపీలు గెలిచినా కేంద్రం నుండి నిధులు తీసుకొచ్చే పరిస్థితి లేదన్నారు బండి సంజయ్ . అతి త్వరలో 20 వేల మందితో క్షేత్రస్థాయి కార్యకర్తల సమ్మేళనం నిర్వహిస్తామని చెప్పారు. బీఆర్ఎస్‌ను కూకటి వేళ్లతో పెకిలిద్దామని ఎంపీ బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు.

# కాళేశ్వరం అవినీతిపై కాంగ్రెస్ దోబూచులాట

## మాజీ సిఎం కెసిఆర్‌ను రక్షించే పనిలో రేవంత్ రెడ్డి

## సిబిఐ విచారణ ఎందుకు కోరడం లేదని ప్రశ్న

## నిజాయితీ ఉంటే సిబిఐ విచారణకు లేఖ రాయాలి

## మీడియా సమావేశంలో కేంద్రమంత్రి, బిజెపి నేత కిషన్ రెడ్డి

హైదరాబాద్,జనవరి2(**సమసమాజం**): తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి పట్ల అనేక సార్లు ప్రస్తావించిన నేతలు ఇప్పుడు పట్టించుకోవడం లేదని కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షులు కిషన్ రెడ్డి అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వంపై విచారణ కోరుతూ కేంద్రానికి కాంగ్రెస్ ప్రభుత్వం లేఖ ఎందుకు రాయటం లేదని ప్రశ్నించారు. సీఎం రేవంత్ లేఖ రాస్తే.. 48 గంటల్లో కేంద్రం సీబీఐ విచారణ చేపడుతోందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటి కాదంటే.. సీబీఐ విచారణ కోరాలన్నారు. న్యాయ విచారణ పేరుతో కేసీఆర్‌కు మేలు చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని తెలంగాణ బీజేపీ చీఫ్ విమర్శించారు. ప్రధానంగా రాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్టు భవిష్యత్తు ఏంటని ప్రశ్నించారు. లక్షకోట్ల రూపాయల అవినీతి ప్రాజెక్టు విషయంలో ఎందుకు సీబీఐ విచారణకు కోరడం లేదని కిషన్ రెడ్డి మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ కుంగిందన్నారు. అన్నారం ప్రాజెక్టు కూడా గ్యారేంటీ లేకుండా పోయిందన్నారు. ఈ నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ ఇమేజ్‌ను గోదావరి పాలు చేసిందని ఎద్దేవా చేశారు. అంతేకాదు ఈ ప్రాజెక్టు గురించి మరింత విశ్లేషణ చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈ ప్రాజెక్టు గురించి 20 అంశాలపైన నేషనల్ డ్యాం సెప్టీ అథారిటీ ప్రశ్నలు అడుగగా ప్రభుత్వం మారినా కూడా వివరాలు అందజేయలేదని గుర్తు చేశారు. 20 అంశాలలో 11 అంశాలకే అరకొర సమాధానాలు చెప్పారని వెల్లడించారు. ప్రస్తుత ముఖ్యముంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు మాట్లాడిన అంశాలు ఎందుకు అమలు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి ప్రాజెక్టులు, స్కాంలపై దర్యాప్తు చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టు కోసం ఖర్చు పెట్టిన కోట్లాది రూపాయల గురించి ఎందుకు మరచిపోయారని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో అసలు కాళేశ్వరం ప్రాజెక్టులో నష్టపోయిన పిల్లర్స్ మళ్లీ కడతారా లేదా నేషనల్ డ్యాం సెప్టీ అథారిటీ సలహాలు తీసుకుంటారో చెప్పాలని కిషన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఈ అంశాన్ని న్యాయ విచారణ పేరుతో ఆలస్యం చేస్తోందన్నారు. కాళేశ్వరం విషయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పూర్తిస్థాయి మెజారిటీ లేదని... అందుకే బీఆర్ఎస్‌తో అవగాహన కుదుర్చుకుందని ఆరోపించారు. తుమ్మితే ఊడిపోయే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అంటూ ఎద్దేవా చేశారు. ఎంఐఎం మధ్యవర్తిత్వంతో మాజీ సీఎం, ప్రస్తుత సీఎంల మధ్య అవగాహన కుదిరిందన్నారు. కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్.. మూడు పార్టీలకు అంగీకారానికొచ్చాయన్నారు. అవినీతి, కుటుంబ పాలన వలనే ఎన్నికలల్లో ప్రజలు కేసీఆర్‌ను ఓడించారన్నారు. కాంగ్రెస్ పార్టీ మీద ప్రేమతో ప్రజలు అధికారం ఇవ్వలేదని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ, కేసీఆర్ పీడ విరగడ కావాలన్న ఉద్దేశంతో కాంగ్రెస్‌కు అధికారమిచ్చారని కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారు.

# పార్లమెంట్ ఎన్నికలపై బిఆర్ఎస్ దృష్టి

## నేటినుంచి పార్టీ నేతలతో కెటిఆర్ సమీక్ష

## వచ్చే లోక్‌సభలో గెలుపే లక్ష్యంగా భేటీలు




హైదరాబాద్,జనవరి2(**సమసమాజం**): తెలంగాణ ఎన్నికలలో పరాభవంతో డీలా పడిపోయిన బీఆర్ఎస్ నేతలు, శ్రేణులను వచ్చే లోక్‌సభ ఎన్నికల కోసం సమాయత్తం చేయడంపై బీఆర్ఎస్ దృష్టి పెట్టింది. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారకరామారావు ఇందు కోసం కసరత్తు ప్రారంభించారు. కసరత్తులో భాగంగా కేటీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ శాసనసభ్యులు, ముఖ్యనేతలతో వరుస భేటీలకు రెడీ అయ్యారు. బుధవారం నుంచి వరుస భేటీలతో పార్లమెంట్ ఎన్నికలకు నేతలను సన్నద్ధం చేయబోతున్నారు. ఈ భేటీలలో లోక్ సభ ఎన్నికలలో అనుసరించాల్సిన వ్యూహం, అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై చర్చించి నేతలకు, క్యాడర్ కు దిశా నిర్దేశర చేయనున్నారు. ముఖ్యంగా అసెంబ్లీ ఎన్నికలలో సిట్టింగులకు టికెట్లు కేటాయించడం వల్లనే భంగపాటుకు గురయ్యామన్న అంచనాల నేపథ్యంలో కేటీఆర్ ప్రధానంగా లోక్ సభ అభ్యర్థుల మార్పుపై దృష్టి పెట్టినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలలో సిట్టింగులకు టికెట్లు ఇవ్వకుండా ఉంటే మరిన్ని స్థానాలలో బీఆర్ఎస్ విజయం సాధించి అధికారపగ్గాలను అందుకుని ఉండేదన్న భావనలో ఉన్న పార్టీ అధినాయత్వం, అటువంటి పొరపాటు లోక్ సభ ఎన్నికలలో జరగకుండా పార్టీ అభ్యర్థుల ఎంపికలో ఆచి తూచి నిర్ణయం తీసుకోవాలన్న నిశ్చయయంతో ఉంది. ఇటీవలి ఎన్నికల్లో గ్రేటర్‌లో బీఆర్ఎస్ కు ప్రజలలో గట్టి పట్టు ఉందని రుజువు కావడంతో ఇక్కడ ఉన్న రెండు పార్లమెంటు స్థానాలలోనూ అభ్యర్థులను రంగంలోకి దింపాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ భావిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి స్థానాల నుంచి పార్టీ ఎవరిని పార్టీ బరిలోకి దింపనున్నదన్న దానిపై పార్టీలో ఆసక్తి వ్యక్తం అవుతోంది. ఈ రెండు లోక్‌సభ స్థానాల పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్ విజయం సాధించింది. దీంతో ఈ రెండు లోక్ సభ స్థానాలలోనే పోటీ కోసం తహతహలాడుతున్న బీఆర్ఎస్ ఆశావహుల సంఖ్య విపరీతంగా పెరిగింది. ఇతర జిల్లాలకు చెందిన నేతలు సైతం ఈ రెండు స్థానాలలోనూ ఎక్కడో ఒక చోట నుంచి పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. మల్కాజ్‌గిరి నుంచి పోటీ చేసేందుకు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ఆసక్తి చూపుతుండగా.. మహబూబ్‌నగర్‌కు చెందిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిలూ కూడా రేసులో ఉన్నామంటున్నారు. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి సైతం తమ కుటుంబంలో ఒకరికి అవకాశం కల్పించాలని కోరుతున్నారు. సికింద్రాబాద్ నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసిన మాజీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ తనయుడు సాయికిరణ్ కూడా రేసులోకి వచ్చారు. అలాగే దాసోజు శ్రవణ్ కూడా ఇక్కడి నుంచి పోటీకి ఆసక్తి చూపుతున్నారు. అయితే గ్రేటర్ పరిధిలోనే ఉన్న హైదరాబాద్ పార్లమెంట్ స్థానంపై మాత్రం బీఆర్ఎస్ పెద్దగా దృష్టి పెట్టడం లేదు.

# ఏపిలో కాంగ్రెస్ కు జవజీవాలు కల్పించే యత్నం

**కాంగ్రెస్ పార్టీలో విలీనం కానున్న షర్మిల పార్టీ**

**పార్టీ అగ్రనేతలతో 4న సమావేశం కానున్న షర్మిల**

**వారి సమక్షంలో ప్రకటన చేయనున్నట్లు సమాచారం**

**వైఎస్సార్‌టిపి సమావేశంలో నేతలకు స్పష్టత**

**నేటి సాయంత్రం ఢిల్లీ వెల్లనున్నట్లు వెల్లడి**



హైదరాబాద్,జనవరి2(**సమసమాజం**): ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో ఆసక్తికరమైన పరిణామం చోటు చేసుకుంది. గత కొన్ని రోజులుగా వైఎస్ షర్మిల పార్టీ విలీనానికి సంబంధించి వస్తున్న వార్తలపై మంగళవారం ఒక స్పష్టత వచ్చింది. తాజాగా హైదరాబాద్‌లోని లోటస్ పాండ్‌లో జరిగిన వైఎస్‌ఆర్‌టీపీ భేటీలో వైఎస్ షర్మిల కీలక ప్రకటన చేశారు. తమ పార్టీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేస్తున్న షర్మిల పార్టీ నేతలకు స్పష్టం చేశారు. లోటస్ పాండ్ లో జరిగిన సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన షర్మిల ఒకటి రెండు రోజుల్లో అన్ని విషయాలు చెబుతానన్నారు. ఇక ఏపి పీసీసీ అధ్యక్ష పదవి ఇస్తామని అడిగార ని దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. ఏఐసిసి జనరల్ సెక్రటరీ పదవి హామీ ఇచ్చారన్నారు. ఈ క్రమంలో వైఎస్ఆర్టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయనున్నట్లు తెలుస్తోంది. బుధవారం రాత్రి పార్టీ ముఖ్య నేతలతో కలిసి ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ అగ్రనేతలతో ఆమె భేటీ కానున్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక సమక్షంలో షర్మిల హస్తం పార్టీలో ఈ నెల 4న గురువారం చేరనున్నట్లు సమాచారం. ఆమెతో పాటు 40 మంది నేతలు కాంగ్రెస్ లో చేరనున్నట్లు తెలుస్తోంది. మంగళవారం ఉదయం అందుబాటులోని పార్టీ ముఖ్య నేతలతో షర్మిల సమావేశం అయ్యారు. పార్టీ విలీనం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రెండు రోజులు ఓపిక పడితే అన్ని విషయాలపైనా క్లారిటీ వస్తుందని షర్మిల చెప్పారు. కాగా, గురువారం మధ్యాహ్నం కుటుంబ సమేతంగా షర్మిల ఇడుపులపాయకు బయలుదేరనున్నారు. కుమారుడు వైఎస్ రాజారెడ్డి వివాహ పత్రికను సాయంత్రం వైఎస్ఆర్ ఘాట్ వద్ద ఉంచి నివాళి అర్పించనున్నారు. అన్ని విషయాలపై రెండు రోజుల్లో స్పష్టత ఇస్తానని షర్మిల వెల్లడించారు. ఇక షర్మిలకు ఏపీ పార్టీ పగ్గాలు అప్పిగించేందుకు కాంగ్రెస్ అధిష్టానం మొగ్గుచూపు తోందని సమాచారం. ఈ మేరకే ఇప్పటికే షర్మిల భర్త అనిల్ కుమార్‌తో ఇప్పటికే ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దలు చర్చలు జరిపినట్లు కూడా వార్తలు వచ్చాయి. ఇక షర్మిలను తిరిగి కాంగ్రెస్‌లోకి తీసుకురావడంలో.. కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు, ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కీలక పాత్ర పోషించినట్లు చెబుతున్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబానికి డీకే సన్నిహితుడుకావడంతోనే కాంగ్రెస్ పెద్దలను ఒప్పించి, ఏపీలో షర్మిలకు పార్టీ పగ్గాలు అప్పగించడానికి ఆయన రంగం సిద్ధం చేసినట్లు గతంలో వార్తలు వచ్చాయి. మరి షర్మిల తిరిగి కాంగ్రెస్‌లోకి చేరడం ఆ పార్టీకి ఏమేర ఉపయోగపడుతుంది.? ఇది ఏపీ రాజకీయాల్లో ఎలాంటి మార్పులకు నాంది పలుకుతుందో చూడాలి.

## వికారాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నా

**చెక్కుల పంపిణీలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**

వికారాబాద్,జనవరి2(**సమసమాజం**):వచ్చే ఐదు సంవత్సరాలలో మూడు వేల కోట్ల రూపాయల నిధులతో వికారాబాద్ జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తానని రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ భవనములో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోవు రోజులలో వికారాబాద్ నియోజకవర్గ ప్రజలందరికి అన్నలా ఉండి జిల్లాను అభివృద్ధి పరుస్తానని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ముందుగా రేషన్ కార్డులు అందజేస్తామని తెలియజేశారు. రేషన్ కార్డుల తర్వాత ఎన్నికలకు ముందు చెప్పినట్లు 6 గ్యారంటీలను అమలుపరుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్, వైస్ చైర్ పర్సన్ శంషాద్ బేగం, ఎంపీపీ చంద్రకళ, మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు మెంబర్లు, వికారాబాద్ నియోజకవర్గ ఎంపీపీలు, సర్పంచులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పెట్రో ట్యాంకర్ల సమ్మె విరమణ

**అయినా బంకుల వద్ద తప్పని క్యూలు**



హైదరాబాద్,జనవరి2(**సమసమాజం**): ఆయిల్ ట్యాంకర్ల యజమానులు ధర్నా విరమించారు. మోటారు వాహనాల చట్టాన్ని సవరించడాన్ని నిరసిస్తూ తెలంగాణలో పెట్రోల్, ఆయిల్ ట్యాంకర్ల యజమానులు నిరసన చేపట్టిన సంగతి తెలిసిందే. తాజాగా ఆ ధర్నాను విరమించారు. 2 రోజులపాటు పెట్రోల్ ట్యాంకర్ల సమ్మె ఉన్నందున పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు బారులు తీరారు. పలు పెట్రోల్ బంకుల వద్ద భారీగా క్యూ లైన్ లలో వాహనదారులు నిల్చున్నారు. మరికొన్ని పెట్రోల్ బంకులలో స్టాక్ అయిపోవడంతో నో స్టాక్ బోర్డులు కనిపించాయి. మరికొన్ని పెట్రోల్ బంకుల్లో పెట్రోల్ మాత్రమే పోస్తున్నారు. డీజిల్ మాత్రం పోయట్లేదని వాహనదారులు తెలిపారు. తాజాగా ఆయిల్ ట్యాంకర్ యజమానులు ధర్నా విరమించడంతో పెట్రోల్, డీజిల్ ట్యాంకర్లు బంకులకు బయలుదేరాయి. కానీ, పెట్రోల్ బంకుల వద్ద రద్దీ మాత్రం అలాగే ఉంది. సమ్మె విరమణతో పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ నిల్వలు పెరగనున్నాయి.

# మహిళా సాధికారతకు నిలువెత్తు రూపం

## స్త్రీ విద్యకు పాటుపడ్డ సావిత్రిబాయి పూలే

## నేడు చదువుల తల్లి జయంతి

ముంబై,జనవరి2(**సమసమాజం**): సావిత్రిబాయి పూలే భారతీయ సంఘ సంస్కర్త, భారత దేశ మొట్టమొదటి మహిళ ఉపాధ్యాయురాలు, రచయిత్రి,మహిళా సాధికారతకు నిలువెత్తు రూపం. ఆమె నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతీరావ్ పూలే భార్య. కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి. ఆమె ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన సావిత్రిబాయి భర్తతో 1848 జనవరి 1న పూణెళిలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించింది. కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యుల, మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటం తమ సామాజికబాధ్యతగా ఆ దంపతులు విశ్వసించారు. నూతన వ్యవస్థ కోసం, ప్రాణాల్ని సైతం ఫణంగా పెట్టి సమష్టిగా పోరాటం చేసారు. సావిత్రి బాయి మహారాష్ట్ర సతారా జిల్లాలో నయాగావ్ అనే గ్రామంలో 1831 జనవరి 3 న జన్మించింది. ఆమెది రైతుకుటుంబం. సావిత్రి బాయి కుటుంబానికి తెలంగాణ ప్రాంతంతో బంధుత్వం ఉంది. సావిత్రి బాయి తన 9వ యేట 12 యేండ్ల జ్యోతిరావు పూలెను 1840లో వివాహమాడారు. ఆ దంపతులకు స్వంత పిల్లలు లేరు. కానీ ఆ జంట యశ్వంతరావు (బ్రాహ్మణ వితంతువు కుమారుడు) ను దత్తత తీసుకున్నారు. 'జ్యోతీరావు పూలె' ప్రోత్సాహంతోనే ఇంట్లోనే అక్షరాభ్యాసం చేసి విద్యావంతురాలైంది. అట్టడుగు వర్గాలు, మహిళలకు చదువు సంపద వంటి సమస్త హక్కులు నిరాకరింప బడిన దేశంలో ఆనాటి సమాజపు కట్టుబాట్లను, బ్రాహ్మణవాద సంప్రదాయాలను, ఆధిపత్యవర్గాలను ధిక్కరించి భారతదేశపు మొట్టమొదటి ఉపాధ్యాయురాలుగా పాఠశాలలు ప్రారంభించి,12 మే 1848న దేశంలో బహుజనులకు మెట్టమెదటి పాఠశాల



ప్రారంభించారు. సమాజంలో ఎన్ని అవమానాలు ఎదురైనా మడమ తిప్పని ధీశాలి ఆమె. కేవలం 4 సంవత్సరాలలోనే గ్రామీణ ప్రాంతాల్లో 20 పాఠశాలలను ప్రారంభించి ఉచిత విద్యనందించారు. 1848 లోనే దేశంలో విద్యా ఉద్యమం ప్రారంభించిన మొదటి మహిళ ఉపాధ్యాయురాలు , దళితుల, స్త్రీల విద్యావ్యాప్తికి కృషి ప్రారంభించే నాటికి ఆమె వయస్సు 18 ఏళ్ళ మాత్రమే. వారి జీవితకాలంలో మొత్తం 52 పాఠశాలలు ప్రారంభించారు. అయితే ఈ క్రమంలో ఆమె ఆధిపత్య కులాల వారి నుంచి అనేక దాడులను, అవమానాలను ఎదుర్కొంది.ఈ నేపథ్యంలోనే 1849లో పూలే, సావిత్రీబాయి దంపతులను గృహ బహిష్కారానికి గురిచేశారు. ఆమె మానవ హక్కుల గురించి ఇతర సామాజిక సమస్యల గురించి స్త్రీలను చైతన్యపరచడానికి 1852లో మహిళా సేవామండల్ అనే మహిళా సంఘన్ని కూడా స్థాపించింది. జెండర్ సమస్యలకు తోడుగా, కుల పితృస్వామ్య వ్యవస్థల అణచివేతకు వ్యతిరేకంగా స్త్రీల సాధికారిత కోసం ఈ సంస్థ కృషిచేసింది. మహిళా హక్కులే మానవ హక్కులని తొలిసారిగా నినదించినది సావిత్రిబాయి పూలే. అసత్యాలతో, అగ్రవర్ణ దురహంకారపు నిచ్చెనమెట్ల కులవ్యవస్థగా నిర్మాణమైన సమాజంలో 'సత్యాన్ని' శోధించడానికి 1873 లో తన భర్త మహాత్మా పూలేతో కలసి 'సత్యశోధక్ సమాజ్ 'ను ప్రారంభించి బాల్యవివాహాలకు, మూడనమ్మకాలకు, సతీసహగమనానికి వ్యతిరేఖంగా మరియు వితంతువు పునఃర్వివాహాల కొరకు అసమాన బ్రాహ్మనిజ వ్యవస్థకు వ్యతిరేఖంగా బలమైన ఉద్యమం నడిపారు. బాల్యంలోనే వైధవ్యాన్ని అనుభవించే ఎంతో మంది ఆడపిల్లలకు అన్నం పెట్టి ఆశ్రయం కల్పించారు. గర్భవతులైన వారికి పురుళ్లు పోసి వారి కళ్లల్లో వెలుగు చూసారు. అలా పురుడు పోసుకుని తన వద్దేవదిలేసి పోయిన ఓ బిడ్డను అక్కున చేర్చుకున్నారు.యశ్వంత్ గా నామకరణం చేసి తమ ఆశయాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా పెంచి పెద్ద చేసారు. వితంతువులకు శిరోముండనం చేయడాన్ని తీవ్రంగా ఖండించి, క్షురకులను చైతన్యపర్చి, వితంతువులకు శిరోముండనం చేయబోమంటూ క్షురకుల చేత 1860లో సమ్మె చేయించారు సావిత్రీబాయి. తరువాత 1873 సెప్టెంబరు 24న 'సత్యసోధక్ సమాజ్' అనే సామాజిక, ఆధ్యాత్మిక సంస్థను ప్రారంభించి, సత్యసోధన కోసం ఉద్యమాన్ని నడిపారు పూలే. ఈ సత్యసోధక్ సమాజ్ మహిళా విభాగం సావిత్రీబాయి నేతృత్వంలో నడిచేది. వివాహాలు వంటి శుభ కార్యాలను పురోహితులు లేకుండా నిర్వహించే విధానాన్ని ఈ సంస్థ ప్రారంభించింది. 1873 డిసెంబరు 25న భార్యను కోల్పోయిన ఒక యువకునికి తన స్నేహితురాలి కుమార్తెతో సత్యసోధక్ సమాజ్ ఆధ్వర్యన సావిత్రీబాయి వివాహం జరిపించారు.1868 నుంచి సావిత్రీబాయి అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడారు. 1870లో ఒకసారి 1896లో మరోసారి దేశంలో తీవ్ర దుర్భిక్షం ఏర్పడినప్పుడు పూలే దంపతులు చేసిన కృషి అనన్య సామాన్యం. కరువు వాతపడిన కుటుంబాలలోని అనాధ బాలలను దాదాపు 2,000 మందిని అక్కున చేర్చుకున్నారు. తమ పాటశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించినారు. సావిత్రిబాయి సంఘ సంస్కర్తగానే గాదు, రచయిత్రిగా కూడా వేగుచుక్కగా నిలిచారు. 1854లోనే ఆమె తన కవితా సంపుటి 'కావ్యపూలే'ను ప్రచురించింది. మరో కవితా సంపుటి 'పావన కాశీ సుభోధ్ రత్నాకర్'ను 1891లో ప్రచురించింది. ఆమె ఉపన్యాసాల్లో కొన్ని 1892లో పుస్తకరూపంలో వచ్చాయి. జ్యోతీరావుపూలే 1890 నవంబరు 28న మరణించడంతో సావిత్రీబాయి అంతులేని దుఃఖ సాగరంలో మునిగిపోయారు. ఈ దుఃఖంలోనుంచే మరో ఆదర్శానికి శ్రీకారం చుట్టారు. తన భర్త పూలే చితికి తానే స్వయంగా నిప్పుపెట్టి కొత్త సంప్రదాయానికి తెరలేపారు. భారతదేశ చరిత్రలో భర్త చితికి భార్య నిప్పు పెట్టిన తొలి సంఘటన ఇది. పూలే మరణాంతరం సత్యసోధాక్ సమాజ్ భాద్యతనీ స్వీకరించి నడిపించింది. 1897 లో ప్లేగు వ్యాధి, పూణెళి నగరాన్ని వణికించింది. నగరమంతా ఎడారిగా మారింది. జనమంతా దగ్గర్లోని అడవుల్లోకి పారిపోయారు. అయినా సావిత్రీబాయి పూలే కొడుకు యశ్వంత్ తో కల్సి వ్యాధిగ్రస్తులకు సేవ చేసారు.ప్లేగు వ్యాధి సోకిన మాంగ్ లాంటి దళిత కులాలకి చెందిన దళిత చిన్నపిల్లలని తన చంకన వేసుకొని చికిత్స చేసి కాపాడింది. చివరికి ఆ ప్లేగు వ్యాధే ఆమెకి సోకి మార్చి 10, 1897 లో కబళించింది. ఆమె దత్తపుత్రుడు యశ్వంత్ అంత్యక్రియలు జరిపించిండు. సావిత్రి బాయి జయంతిని భారతదేశ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా జరుపుకుంటున్నాము.

# సిఎం రేవంత్‌తో నీతి ఆయోగ్ చైర్మన్ భేటి

(మొదటి పేజీ తరువాయి) చర్చించారు. నీతి ఆయోగ్, రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కొంటున్న సవాళ్లు పరిష్కరించడానికి కలిసి పనిచేయడానికి అంగీకరించాయి. రాష్టాభివృద్ధి, కీలక రంగాలకు సంబంధించి ప్రాధాన్యతలను, రాష్ట్ర అవసరాలను ముఖ్యమంత్రి నీతి ఆయోగ్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్ర అభివృద్ధికి తమవంతుగా సహకారమందిస్తామన్నారు. కేంద్రం నుంచి అందవలసిన న్యాయమైన కేటాయింపులు, వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల కోసం రాష్టానికిచ్చే నిధులు, వనరుల మంజూరు గురించి చర్చించారు. ముఖ్యమంత్రి నీతి ఆయోగ్ దృష్టికి తీసుకొచ్చిన అంశాల్లో 16వ ఆర్థిక సంఘం ద్వారా ఇచ్చే నిధుల కేటాయింపు పెరిగేలా చూడాలన్నారు. ఆరోగ్యం, విద్యలో మౌలిక సదుపాయాల కోసం నిధులు కేటాయింపు పెంచాలన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014లోని సెక్షన్ 94(2) ప్రకారం వెనుకబడిన జిల్లాల అభివృద్ధి గ్రాంట్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.1800 కోట్ల నిధుల విడుదల గురించి చర్చించారు. వినూత్న పాలనా పద్ధతులు, విజయవంతమైన నమూనాలను పరస్పరం సహకరించుకోవాలని అంగీకారం తెలిపారు. స్థానిక సమస్యలు పరిష్కరించడంలో మెరుగైన పద్ధతులను అవలంబించాలని నీతి ఆయోగ్ సూచించడం జరిగింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్సెస్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి, రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో గ్రాడ్యుయేషన్ కోర్సులను అభ్యసిస్తున్న యువతలో నైపుణ్యాలను పెంపొందించాలని నిర్ణయించారు. సోలార్ ఎనర్జీని వినియోగించుకోవడంపై సమావేశంలో చర్చించి రాష్టానికి సహకరించాలని కోరింది. చర్చల్లో భాగంగా రాష్ట్ర సామర్థ్యాలను పటిష్టం చేయడానికిగాను స్టేట్ ఇన్స్టిట్యూట్ అఫ్ ట్రాన్స్ఫర్మేషన్ (ఎస్.ఐ.టి) ను రాష్ట్రలో ఏర్పాటుపై దృష్టి సారించారు. అంతర్జాతీయ అత్యుత్తమ స్థాయిలతో మోడల్ ద్వారా సబర్మతి రివర్ ఫ్రంట్ మరియు నమామి గంగే వంటి ప్రోజెక్టుల మాదిరిగానే మూసి రివర్ ఫ్రంట్ ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి కోసం సాంకేతిక సహకారం అందించాలని కోరారు. మురుగునీటి శుద్ధి ప్లాంట్స్ ఏర్పాటు కోసం సహకరించాలని కోరారు. హ÷దరాబాద్ ను కాలుష్య రహిత నగరంగా అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వ సహకారం అందించాలని అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి కోరారు. సహకార సమాఖ్య స్ఫూర్తితో కేంద్రప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, ప్రజల సంక్షేమం, శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని భాగస్వామ్యంతో కలసి పనిచేయాలని నిర్ణయం. నీతి ఆయోగ్ పాలక మండలిలో రాష్ట్ర భాగస్వామ్యం కావాలని నీతి ఆయోగ్ కోరింది. నిర్మాణాత్మక మద్దతు మరియు సహకారం నీతి ఆయోగ్ కు అందిస్తామని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. సమావేశములో నీతిఆయోగ్ నుండి వైస్ చైర్మన్ సుమన్ కుమార్, మెంబెర్ విజయ కుమార్, డైరెక్టర్ జనరల్ సంజయ్ కుమార్, డైరెక్టర్ అభినేష్ డాష్, ముత్తు కుమార్ రాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రభుత్వ ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలకు నితరంతరం అందుబాటులో ఉంటా


**ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి**

సిద్దిపేట,జనవరి2(**సమసమాజం**): పార్టీ అధికారంలో లేకపోయినా ప్రజల వసరాలు తీర్చేలా పని చేస్తానని దుబ్బాక బీఆర్ఎస్ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తెలిపసారు. మంగళవారం నాడు దుబ్బాకలో బీఆర్ఎస్ కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ సభలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, జడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ... 54 వేల మెజార్టీతో తనను గెలిపించి తన మీద చాలా బాధ్యత పెట్టారని చెప్పారు. లోకల్ బాడీ ఎన్నికల్లోనూ అందరం కలిసి పని చేసి గెలిపించుకుందామని తెలిపారు. వచ్చేది మన ప్రభుత్వమేనని కార్యకర్తలు అధైర్యపడొద్దని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి భరోసా కల్పించారు.

## ఎందుకు అంత ఆక్రోశం!

# బైరి నరేష్ పై, అంబేడ్కర్ వాదులపై బిజెపి మతతత్వవాదుల దాడిని ఖండిస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి) రంగారెడ్డి, జనవరి 3 (సమ సమాజం): 2022 లో బైరి నరేష్ చేసిన వ్యాఖ్యలకు ఇప్పుడు 2024 లో క్షమాపణ చెప్పాలని కోరడం సరైనది కాదు. గతంలోనే ఈ విషయముపై తగిన వివరణ బైరి నరేష్ ఇచ్చి ఉన్నాడు. ఆ కార్యక్రమంలో భీమా కోరేగాం అమరవీరుల గురించి మాట్లాడవద్దు అని హుకుం జారీ చేయడం చాలా దుర్మార్గం. అక్కడ ఎటువంటి గొడవ జరగకూడదని అందరి మనోభావాలు గౌరవించి, బాధపడిన వారికి డా బైరి నరేష్ మరోమారు క్షమాపణ చెప్పి శాంతియుతంగా వెళ్లిపోతుండగా డా॥ బైరి నరేష్ వాహనంపై దాడి చేయటం సిగ్గుచేటు. ఈ సందర్భంగా మూఢనమ్మకాల నిర్మూలన సంఘం, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గనిమళ్ళ శ్రీరాములు మాట్లాడుతూ... రాళ్లు కర్రలతో దాడి చేయాలని ప్రయత్నిస్తుండగా ప్రాణాలతో బయటపడినది బైరి నరేష్ కుటుంబం. బైరి నరేష్ గాండ్ల , సుజాతల జంట మూఢనమ్మకాల నిర్మూలన సంఘాన్ని స్థాపించి సమాజంలో ఉన్న అజ్ఞానాన్ని తొలగించడానికి నిస్వార్థంగా పనిచేస్తున్న మంచి మనుషులు. ఎవరికి ఏ హాని తలపెట్టని ఆ కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేసి చంపడానికి ప్రయత్నించిన వారిపై ప్రభుత్వం కఠిన



చర్యలు తీసుకోవాలి. అయ్యప్ప స్వాములను బైరి నరేష్ కారుతో ఢీకొన్నాడు అనడం అసత్య ప్రచారం. అతను వెళుతూ ఉంటే కారు వెనకాల అయ్యప్ప మాలదారులు కర్రలు రాళ్లు పట్టుకొని వెంటాడడం నిజంగా రౌడీల రాజ్యంగా భావించవచ్చు. ఆ ఒత్తిడిలో డ్రైవ్ చేస్తూ వెళుతున్న కారు గుంతలు గుంతలు గా ఉన్న రోడ్డు వద్ద అదుపుతప్పి చెట్టును ఢీకొన్నది. సకాలంలో ఎయిర్ బెలూన్స్ ఓపెన్ అయి ప్రాణాలతో బయటపడ్డ బైరి నరేష్ పారిపోయాడని అసత్య ప్రచారం చేయడం సరైనది కాదు. బైరి నరేష్ పై వ్యక్తిగతంగా ఉన్న కక్షను ఆసరాగా చేసుకుని మీడియా ఛానళ్ల వారు తమ టీఆర్పి రేటు కోసం అంబేద్కర్ సమావేశాన్ని తప్పుడు ప్రచారం చేయడం నిజంగా దారుణం. ఆ సమావేశాన్ని అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకోకుండా, వేటాడి చంపుతానని వెంటబడిన వారిపై చర్యలు తీసుకోకుండా, వారి మనోభావాలు దెబ్బతీయ కుండా శాంతియుత వాతావరణం కోసం స్వచ్ఛందంగా మాట్లాడకుండా సమావేశం బయటకు వచ్చిన బైరి నరేష్ పై కేసు నమోదు చేయడం విచారకరం. ప్రభుత్వం దీనిపై సమగ్ర విచారణ జరిపి బైరి నరేష్ కుటుంబానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నాము. ఈ ఘటనకు కుట్ర చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరుతున్నాము. ఇటువంటి ఘటనలు ప్రజలను ప్రజాస్వామిక వాదులను, ప్రజా సంఘాల వారిని మేధావులను ఆందోళనకు గురిచేస్తాయి. అంబేద్కర్ పేరుతో జరిగే కార్యక్రమాలపై మతతత్వ శక్తులు విషం చిమ్ముతూ అడ్డుకోవడం ప్రగతి నిరోధకం. రానున్న రోజుల్లో ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించే వారికి ఈ ఘటన ఎన్నో అనుమానాలను ఇస్తుంది. కాబట్టి ప్రభుత్వము అధికారులు ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని ప్రజలను, ప్రజాసంఘాల వారి గొంతును కాపాడాలని కోరుతున్నాము. భావ ప్రకటన స్వేచ్ఛను కాలరాస్తు చట్టాన్ని చేతిలోకి తీసుకొని మేధావులు విద్యావంతులు సోషల్ వర్కర్స్ పై చేస్తున్న ఇలాంటి దౌర్జన్యాలను అందరూ ఖండించాలి. అమాయక అయ్యప్ప స్వాములను తమ స్వార్థ రాజకీయ ప్రయోజ నాలకు వాడుకుంటున్న వారిని గుర్తించాలి. నాస్తిక , హేతువాద ,మానవ వాదులపై ప్రజాస్వా మిక వాదులపై మేధావులు విద్యావంతులపై మనోభావాల పేరుతో మత ఉన్మాదుల ను ఉసిగొల్పడం గుర్తించి నివారణ చర్యలు వెంటనే చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రకటిస్తున్నాం.



**Edited, Printed, Published & owned by *GOSUKONDA PRUDHVIRAJU*,** Published From, Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, TELANGANA,
**Printed at *Panidhar PUBLICATIONS.*** Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, ***Editor: GOSUKONDA PRUDHVIRAJU*,**
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in